# రవాణాశాఖలో నూతన ఉద్యోగాలు

- 43 మంది ఏఎంవీఐలకు నేడు నియామక పత్రాలు
- 45 రోజుల పాటు ట్రైనింగ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రవాణాశాఖలో నూతన ఉద్యోగ నియామకాలు మొదలయ్యాయి. టీఎస్‌పీఎస్సీ ద్వారా నిర్వహించిన పరీక్షలో, రవాణాశాఖలో ఏఎంవీఐ (అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్స్) ఉద్యోగాలకు సంబంధించి 43మంది ఎంపికయ్యారు. వారి జాబితాను రవాణాశాఖ కార్యాలయానికి టీఎస్‌పీఎస్సీ అందించింది. రవాణాశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి సోమవారం రవాణాశాఖ కార్యాలయంలో ఎంపికైన అభ్యర్థులందరికీ నియామక పత్రాలు అందించనున్నట్లు కమిషనర్ సందీప్ కుమార్ సుల్తానియా తెలిపారు. టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన పరీక్షల్లో అర్హత సాధించిన వారి సర్టిఫికెట్ల పరిశీలన ప్రస్తుతం కొనసాగుతున్నది. ఎంపికైన అభ్యర్థులు రవాణాశాఖ కార్యాలయానికి వచ్చి తమ సర్టిఫికెట్లను అధికారులకు చూపెడుతున్నారు. ఎంపికైన అభ్యర్థులకు అప్పాలో 45 రోజులపాటు డిపార్ట్‌మెంట్ అధికారుల చేత శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. అలాగే ఎంసీహెచ్‌ఆర్డీలో కూడా నిపుణులతో ప్రత్యేక శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు.

**రవాణాశాఖలో మొదటి నియామకాలు**

ఎంతోకాలం నుంచి రవాణాశాఖలో ఖాళీగాఉన్న ఏఎంవీఐ పోస్టుల నియామకం తెలంగాణ ప్రభుత్వంలో సాకారం కావడంతో రాష్ట్ర యువతకే అవకాశం లభించినట్లయింది. 43 పోస్టులకు టీఎస్‌పీఎస్సీ ద్వారా గత నవంబర్ నెలలో పరీక్షలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన అభ్యర్థులను గుర్తించి వారికి ఈ నెల 3న ఇంటర్వ్యూలు పూర్తిచేసి ఉద్యోగానికి ఎంపికైనట్లు ప్రకటించింది.



**ఆదివారం మంత్రి మహేందర్‌రెడ్డిని కలిసిన నూతనంగా ఎంపికైన ఏఎంవీఐలు**

మంత్రిని కలిసిన నూతన ఏఎంవీఐలు: నూతనంగా ఏఎంవీఐలుగా ఎంపికైన అభ్యర్థులు రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డిని తన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రవాణాశాఖ నూతన టెక్నాలజీని అందిపుచ్చుకుని ముందుకు సాగుతున్నదని, దీనికితోడు యువత కొత్తగా ఉద్యోగాల్లోకి రావడంతో మరింతగా ముందడుగు వేస్తామని అన్నారు. నూతనంగా ఎంపికైన వారికి శిక్షణ పూర్తయిన తర్వాత పోస్టింగ్‌లు ఇస్తామని మంత్రి చెప్పారు. ఈ సందర్భంగా మంత్రిని నూతన ఏఎంవీఐలు పుష్పగుచ్ఛాలతో సన్మానించారు.